# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 30 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 117 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ఉద్యోగులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

* సచివాలయ సాంస్కృతిక ఉత్సవంలో మంత్రి జూపల్లి
* సృజనాత్మకతకు వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు
* ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉద్యోగులు విధులను సమర్థంగా నిర్వహించడంతో పాటు క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం వంటి రంగాలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సచివాలయ సాంస్కృతిక ఉత్సవంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేష్ దత్ హెక్కా, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో..

## మస్కట్‌లో చిక్కుకున్న మహిళకు అండగా కేటీఆర్

* తల్లిని స్వదేశానికి రప్పించాలని యువకుడి విజ్ఞప్తి
* ఎన్ఆర్ఐ ప్రతినిధులతో మాట్లాడాలని సూచన
* అన్ని విధాల సహాయం చేస్తామని కేటీఆర్ భరోసా



2 లో..

# తుమ్మిడిహట్టి బ్యారేజీ

## అనుమతులకు చొరవ తీసుకోండి

* కేంద్ర జల్ శక్తి మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
* తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులపై విస్తృత చర్చ
* కృష్ణా, గోదావరి బేసిన్ అంశాల ప్రస్తావన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వ అనుమతులు త్వరగా లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌ను కోరారు. ఢిల్లీలో మంత్రి

మిగతా 2 లో..



## ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది

* కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే
* న్యూఢిల్లీ సమావేశానికి హాజరైన రేవంత్ రెడ్డి, దామోదర రాజనర్సింహ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన న్యూఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

మిగతా 2 లో..

## రాజ్యాంగ విలువల కోసం పోరాటం కొనసాగిస్తాం

* దళిత, ఆదివాసీ ఆత్మగౌరవ సదస్సులో భట్టి విక్రమార్క
* ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల వేదిక ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన దళితఆదివాసీ ఆత్మగౌరవ సదస్సులో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి

మిగతా 2 లో..

## పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

* రెడ్ హిల్స్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన
* ఏడాదిలోపే లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తామని హామీ
* మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

మిగతా 2 లో..

## కొంగరకుర్దు భూముల వ్యవహారంపై కల్వకుంట్ల కవిత ఆరోపణలు

* వక్ఫ్ భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్
* భూ లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి
* రైతుల హక్కులను కాపాడాలని తెలంగాణ రక్షణ సేన పిలుపు

**రంగారెడ్డి, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

రంగారెడ్డి జిల్లా కొంగరకుర్దు-ఏ గ్రామ భూ వివాదాల అంశంపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత భూ బాధిత రైతులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంగరకుర్దులోని భూములకు సంబంధించిన వివిధ అంశాలపై ఆమె పలు ఆరోపణలు చేస్తూ, భూ లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల హక్కులు, భూముల రక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంగరకుర్దులోని సర్వే నంబర్లు

మిగతా 2 లో..




## పప్పుధాన్యాల సాగులో దేశంలో రెండో స్థానంలో తెలంగాణ

* జాతీయ రబీ సదస్సులో రాష్ట్ర ప్రగతిని వివరించిన తుమ్మల
* రైతుల ప్రయోజనాల కోసం కేంద్రానికి పలు విజ్ఞప్తులు.. ఆయిల్‌పామ్, కృషి విజ్ఞాన కేంద్రాలపై ప్రత్యేక ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో పప్పుధాన్యాల సాగు గత ఏడాదితో పోలిస్తే 36 శాతం పెరిగి దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ రబీ సదస్సులో పాల్గొన్న ఆయన తెలంగాణ వ్యవసాయ రంగంలో సాధిస్తున్న పురోగతి, రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. పంటల వైవిధ్యీకరణ, డిజిటల్ వ్యవసాయం, వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధి, రైతులకు రుణ సదుపాయాల విస్తరణ వంటి అంశాలను వివరించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణలో ప్రత్యామ్నాయ

మిగతా 2 లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఉద్యోగులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతిరోజూ పనిభారంతో విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని అన్నారు. కళలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని పేర్కొన్నారు. పని ఒత్తిడిని తగ్గించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.

సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిలో ఎన్నో కళా ప్రతిభలు దాగి ఉన్నాయని మంత్రి తెలిపారు. వాటిని వెలికితీసేందుకు ఇలాంటి సాంస్కృతిక వేదికలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఉద్యోగులు కేవలం కార్యాలయ బాధ్యతలకే పరిమితం కాకుండా తమలోని సృజనాత్మకతను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గెలుపు, ఓటమి కంటే పాల్గొనడం, ప్రతిభను ప్రదర్శించడం, సహోద్యోగులతో ఆనందాన్ని పంచుకోవడం ముఖ్యమని చెప్పారు. ఉద్యోగుల్లో ఉత్సాహం, ఐక్యత, సానుకూల దృక్పథాన్ని పెంపొందించేందుకు తరచూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని జూపల్లి సూచించారు. ఉద్యోగులు సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటే ప్రభుత్వ పనితీరు మరింత మెరుగుపడుతుందని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే ఉద్యోగుల్లో స్ఫూర్తి, ఉత్సాహం ఉండాలని పేర్కొన్నారు. భారతదేశానికి వేల ఏళ్ల చరిత్ర కలిగిన సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలు ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు కూడా తమ పిల్లలకు భారతీయ సంస్కృతిని నేర్పిస్తున్నారని తెలిపారు. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు సంస్కృతి పరిరక్షణలోనూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ప్రస్తావించిన మంత్రి, ఆ సమయంలో పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యమానికి గొప్ప స్ఫూర్తిగా నిలిచాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన మంత్రి, ఉద్యోగులు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు సాంస్కృతిక శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# తుమ్మిడిహట్టి బ్యారేజీ అనుమతులకు చొరవ తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి, తెలంగాణకు సంబంధించిన కీలక నీటిపారుదల ప్రాజెక్టుల అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే అందించినట్లు తెలిపారు.

తుమ్మిడిహట్టి బ్యారేజీని పూర్తి జలమట్టం 152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అవగాహన కుదిరేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మాణం జరిగితే గ్రావిటీ విధానంలో నీటిని ఎల్లంపల్లికి తరలించే అవకాశం ఉంటుందని వివరించారు. దీనివల్ల విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్‌కు పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు. అనుమతుల జాప్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని, అభివృద్ధి పనులు ఆలస్యమవుతున్నాయని వివరించారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను కూడా త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు సమగ్ర నివేదికను ఇప్పటికే సమర్పించినట్లు పేర్కొంటూ, నీటిపారుదల ప్రణాళికలు అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన ఆమోదాలు త్వరగా ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిరభ్యంతర పత్రం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సిన టెలీమెట్రీ వ్యవస్థలను వేగవంతం చేయాలని కూడా ముఖ్యమంత్రి కోరారు. తొలి దశ టెలీమెట్రీ పరికరాల ఏర్పాటుకు అవసరమైన నిధులను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెండో, మూడో దశల పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ కాకా వంశీ గడ్డం, రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో సాగునీటి వనరుల విస్తరణ, ప్రాజెక్టుల పూర్తి కోసం కేంద్రం సానుకూల సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

# పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నాంపల్లి నియోజకవర్గ పరిధిలోని రెడ్ హిల్స్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పేదవాడు జీవితంలో ఒక్కసారైనా సొంత ఇంటిలో నివసించాలనే ఆకాంక్షను నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి అన్నారు. నగర ప్రాంతాల్లో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి వాటిని గృహ నిర్మాణ శాఖకు బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఈ భూముల్లో బహుళ అంతస్తుల నివాస సముదాయాలను నిర్మించి పేద కుటుంబాలకు అందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పారదర్శక ఎంపిక ప్రక్రియలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు మంత్రి వెల్లడించారు. మొదటి విడతలో అవకాశం రాని వారికి తదుపరి విడతల్లో ఇళ్లు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. నగరంలోని పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ గృహ నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించామని, అనేక ప్రాంతాల్లో నిర్మాణ పనులకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. త్వరలోనే మరిన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రస్తుతం నిర్మించనున్న ప్రతి నివాస గృహం విలువ సుమారు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని మంత్రి తెలిపారు. రెండు లేదా మూడు సంవత్సరాలు కాకుండా కేవలం ఏడాదిలోపే నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా కేవలం పత్రాలు ఇచ్చి వదిలేయకుండా నేరుగా లబ్ధిదారుల పేర్లపైనే నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అదనపు భారం లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లు అందేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో నివసించే కుటుంబాలకు భవిష్యత్తులో ఎలాంటి మౌలిక సదుపాయాల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి వివరించారు. ముఖ్యంగా మురుగునీటి పారుదల వ్యవస్థను ప్రధాన మార్గాలతో అనుసంధానం చేసి శాశ్వత పరిష్కారం కల్పిస్తామని తెలిపారు. నిర్మాణ పనుల నాణ్యతపై లబ్ధిదారులకే పర్యవేక్షణ అవకాశం కల్పిస్తామని, వారానికి ఒక రోజు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి తమ ఇల్లు ఎలా నిర్మితమవుతోందో స్వయంగా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. పేదలను నగరానికి దూరంగా తరలించి ఇళ్లు నిర్మించే విధానాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరించడం లేదని మంత్రి స్పష్టం చేశారు. జీవనోపాధి, విద్య, ఆరోగ్యం వంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రతి తండా, ప్రతి గూడెం, ప్రతి వార్డు, ప్రతి డివిజన్‌లో అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కొంగరకుర్దు భూముల వ్యవహారంపై కల్వకుంట్ల కవిత ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

2 నుంచి 400 వరకు ఉన్న సుమారు 580 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు చెందినదిగా గతంలో గుర్తింపు పొందిందని కవిత పేర్కొన్నారు. ఈ భూముల్లో గణనీయమైన భాగం అక్రమంగా ఇతరుల ఆధీనంలోకి వెళ్లిందని ఆరోపించారు. భూముల యాజమాన్యంపై ప్రస్తుతం న్యాయస్థానాల్లో వివాదం కొనసాగుతోందని, తుది తీర్పు వచ్చే వరకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.భూముల విషయంలో రైతులు పలుమార్లు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని కవిత ఆరోపించారు. కొన్ని రికార్డులు, ధ్రువపత్రాల ఆధారంగా భూముల లావాదేవీలు జరిగాయని పేర్కొంటూ వాటిపై పూర్తి స్థాయి విచారణ అవసరమని అన్నారు. 2022 తర్వాత జరిగిన భూముల నమోదు ప్రక్రియలను పరిశీలించి చట్టబద్ధతను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. కొంగరకుర్దు ప్రాంతంలో నిర్మాణ సంస్థలు చేపడుతున్న అభివృద్ధి పనులు, అనుమతుల జారీ అంశాలపై కూడా ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. నిషేధిత జాబితాలో ఉన్నట్లు పేర్కొంటున్న భూముల్లో అనుమతులు ఎలా మంజూరయ్యాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. సంబంధిత శాఖలు పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. భూముల విషయంలో రైతులు, వక్ఫ్ బోర్డు మధ్య న్యాయపరమైన వివాదం కొనసాగుతున్నందున కోర్టు తీర్పును గౌరవించాలని కవిత అన్నారు. తుది తీర్పు వెలువడే వరకు ఎలాంటి కొత్త లావాదేవీలు లేదా విస్తరణ పనులు చేపట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల జీవనాధారాన్ని దెబ్బతీసే చర్యలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూ వ్యవహారాలపై వచ్చిన ఆరోపణలు, వివాదాల నేపథ్యంలో ప్రభుత్వం స్వతంత్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని కవిత డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు భూముల యాజమాన్యంపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. కొంగరకుర్దు భూముల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది

(మొదటి పేజీ తరువాయి)






రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. దేశ రాజకీయ పరిస్థితులు, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, రాబోయే ఎన్నికల వ్యూహాలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది.

ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసం చేసిన మల్లికార్జున ఖర్గే, దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ విలువల పరిరక్షణ అత్యంత కీలక దశకు చేరుకుందని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి ప్రజాస్వామ్య పరిరక్షణ వరకు కాంగ్రెస్ పార్టీ చారిత్రక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం స్వరం వినిపిస్తోందని ఖర్గే అన్నారు. ఓటర్ల జాబితాలకు సంబంధించిన అంశాలపై పారదర్శకత ఉండాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు, రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఎన్నికల జాబితాల్లో మార్పులు, ఓటర్ల తొలగింపులు వంటి అంశాలపై పూర్తి వివరాలు బహిర్గతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. ఓటర్లకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించడం, రాజకీయ పార్టీలకు సంబంధిత సమాచారం సకాలంలో అందించడం, అవసరమైన చోట స్వతంత్ర విచారణలు నిర్వహించడం వంటి అంశాలను పార్టీ ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్నారు. రాహుల్ గాంధీ లేవనెత్తిన ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన ప్రశ్నలను కూడా ఖర్గే ప్రస్తావించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా అన్ని సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వతంత్ర సంస్థల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

రాబోయే రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ప్రజల మధ్యకు వెళ్లాలని, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన హక్కుల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఖర్గే పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం రోడ్డు నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, వివిధ రాష్ట్రాల ముఖ్య నేతలు, పార్టీ పదాధికారులు పాల్గొన్నారు. దేశ రాజకీయ పరిస్థితులతో పాటు పార్టీ సంస్థాగత బలోపేతం, ఎన్నికల సన్నాహాలు, ప్రజా సమస్యలపై భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# మస్కట్‌లో చిక్కుకున్న మహిళకు అండగా కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఒమన్‌లోని మస్కట్ నగరంలో చిక్కుకుపోయిన ఓ మహిళను స్వదేశానికి రప్పించేందుకు సహకరించాలని కోరుతూ కొడంగల్ నియోజకవర్గానికి చెందిన యువకుడు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిశాడు. తన తల్లి ఏడాదిగా విదేశంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆమెను భారతదేశానికి తీసుకురావడంలో సహాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు. కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలం గోకఫసల్వాద్ గ్రామానికి చెందిన తుప్పుడు లక్ష్మి కుటుంబ పోషణ కోసం ఏడాది క్రితం మస్కట్‌కు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటి పనుల కోసం వెళ్లిన ఆమెకు కొంతకాలం ఉపాధి కల్పించినప్పటికీ, అనంతరం జీతం ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారని పేర్కొన్నారు. పరిస్థితి విషమించడంతో తన కుమారుడు రాజుకు ఫోన్ ద్వారా విషయం తెలియజేసినట్లు తెలిపారు.

తన తల్లి పరిస్థితిపై ఆందోళన చెందిన రాజు ఆమెను స్వదేశానికి రావాలని కోరినట్లు సమాచారం. అనంతరం ఆమెతో సంబంధాలు తెగిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వివిధ మార్గాల ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించలేదని రాజు తెలిపాడు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమం ద్వారా తన సమస్యను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లిన రాజును తెలంగాణ భవన్‌కు ఆహ్వానించి కేటీఆర్ మాట్లాడినట్లు వెల్లడించారు. రాజు నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్న అనంతరం ఒమన్‌లోని ప్రవాస భారతీయుల ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలని సూచించినట్లు సమాచారం.

లక్ష్మి సురక్షితంగా స్వదేశానికి చేరుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ప్రతినిధులను కేటీఆర్ కోరినట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి తగిన సహకారం అందిస్తామని, ఆందోళన చెందవద్దని రాజుకు భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. తన సమస్యను విన్న వెంటనే స్పందించిన కేటీఆర్‌కు రాజు కృతజ్ఞతలు తెలిపాడు. తల్లి సురక్షితంగా స్వదేశానికి చేరుకోవాలని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన ప్రవాస కార్మికులు ఎదుర్కొనే సమస్యలపై మరోసారి చర్చకు దారి తీసింది.

# రాజ్యాంగ విలువల కోసం పోరాటం కొనసాగిస్తాం




(మొదటి పేజీ తరువాయి)

విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. సదస్సులో మాట్లాడిన భట్టి విక్రమార్క, హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై జరిగిన ఘటనను ఖండించారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీతో పాటు అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై ఆందోళన వ్యక్తం చేశారు.

సామాజిక న్యాయం కోసం స్వరం వినిపిస్తున్న ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేయడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదవుతున్న కేసులు సంస్థాగత నిష్పక్షపాతతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరిరక్షణ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల గౌరవం, హక్కుల రక్షణ కోసం పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

దేశ నిర్మాణంలో అణగారిన వర్గాలకు సముచిత స్థానం కల్పించాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జరిగే అన్యాయాలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ వర్గాల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు హాజరై సామాజిక న్యాయం, సమాన హక్కుల అంశాలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

# పప్పుధాన్యాల సాగులో దేశంలో రెండో స్థానంలో తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. నీటి లభ్యత, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే పప్పుధాన్యాల సాగు గణనీయంగా పెరిగి రాష్ట్రం జాతీయ స్థాయిలో ముందంజలో నిలిచిందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు నేల సారాన్ని కాపాడడంలో కూడా పప్పుధాన్యాల సాగు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో నెలకొన్న కరువు, లోటు వర్షపాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న, జొన్న పంటలను ధరల మద్దతు పథకం పరిధిలోకి తీసుకురావాలని కేంద్రాన్ని కోరినట్లు తుమ్మల వెల్లడించారు. అనేక మండలాలు తీవ్ర వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నందున మండలాల వారీగా పరిస్థితులను అంచనా వేసి ప్రత్యేక కేంద్ర సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టులు, నీటి సంరక్షణ చర్యలు, రక్షిత సాగునీటి వ్యవస్థలకు అదనపు సహకారం అవసరమని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో తెలంగాణ రైతులు విశేష స్పందన చూపారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అదనంగా లక్షకు పైగా హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించిందని, వేలాది మంది రైతులు ఈ పంట సాగులోకి వచ్చారని వివరించారు. ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ఆయిల్‌పామ్ ధరల అంశాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో శాస్త్రీయ విధానాలను మరింత విస్తరించేందుకు తెలంగాణలో మట్టి ఆరోగ్య పరీక్షల లక్ష్యాన్ని రెట్టింపు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తుమ్మల తెలిపారు. ప్రస్తుతం ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలు రాష్ట్ర అవసరాలకు సరిపోవడం లేదని, అదనంగా 16 కేంద్రాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం వేగంగా రైతులకు చేరాలంటే పరిశోధన, విస్తరణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొడంగల్‌లో అగ్రి వ్యాపార పార్కు, పొడి వాతావరణ ఉద్యాన పంటల కోసం అత్యుత్తమ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలను కేంద్రం సానుకూలంగా పరిశీలించాలని మంత్రి కోరారు. రైతులకు విత్తనాలు, ఎరువులు మాత్రమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, నేల ఆరోగ్య సమాచారం, సకాలంలో రుణాలు, మార్కెట్ అవకాశాలు, నీటి పొదుపు పద్ధతులు కూడా అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 30 - సెప్టెంబర్ - 2026


# రాజయ్య కారుకూతలు మానుకో..!



- ఇందిరమ్మ ఇళ్లపై అసత్య ఆరోపణలు సిగ్గుచేటు
- సర్పంచ్ మందపురం రాణి అనిల్ గౌడ్

**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** తన ఉనికిని చాటుకునేందుకే మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఇందిరమ్మ ఇళ్లపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఇప్పగూడెం సర్పంచ్ మందపురం రాణి అనిల్ గౌడ్ మండిపడ్డారు. ఇప్పటికైనా కారుకూతలు మానుకోవాలని హితవు పలికారు. మంగళవారం ఇప్పగూడెంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి రూ.50 వేల చొప్పున లంచం తీసుకున్నారని రాజయ్య చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. లబ్ధిదారుల నుంచి తాము డబ్బులు తీసుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. ఆరోపణలను నిరూపిస్తే ప్రజా శిక్షకు సిద్ధమని, నిరూపించలేకపోతే రాజయ్య రాజకీయ సన్యాసం తీసుకుంటారా? అని ప్రశ్నించారు.
గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇప్పగూడెం గ్రామానికి ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేయని వారు ఇప్పుడు ఇళ్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పదవిని అడ్డుపెట్టుకుని చిన్నచిన్న పనులకు సైతం లంచాలు అడిగిన వారు అవినీతి గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో ఇప్పగూడెం గ్రామానికి 94 ఇందిరమ్మ ఇళ్లు, రూ.2.30 కోట్ల విలువైన సీసీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన మరో నలుగురు లబ్ధిదారులకు కూడా త్వరలో ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.
ఇకపై చిల్లర మాటలతో నిరాధార ఆరోపణలు చేసే ముందు ఆలోచించి మాట్లాడాలని రాజయ్యను హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కత్తుల మల్లయ్య యాదవ్, వార్డు సభ్యులు కత్తుల రాజయ్య, రవి, దైద ఎలిషన్, రాజు, గట్టు మల్లయ్య, కృష్ణమూర్తి, కాంగ్రెస్ ముఖ్య నాయకుడు కత్తుల కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# పల్లగుట్టలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



- సర్పంచ్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి వైద్య సేవలు

**చిల్పూర్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట గ్రామపంచాయతీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎనగందుల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మల్లారెడ్డి నారాయణ బహుళ వైద్య ప్రత్యేక ఆసుపత్రి వైద్యులచే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన శిబిరంలో గ్రామస్తులకు రక్తపోటు, మధుమేహం, జ్వరాలు, కీళ్ల నొప్పులు తదితర 25 రకాల అనారోగ్య సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలు, ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఈసీజీ, ద్విమితీయ గుండె పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆసుపత్రికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించి చికిత్స అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించిన ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్యులకు సర్పంచ్ ఎనగందుల నరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహించి పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం



- 19, 49వ డివిజన్లలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**కరీంనగర్, సెప్టెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు మరింత వేగం పెంచారు. మంగళవారం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి 19, 49వ డివిజన్లలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 49వ డివిజన్ విద్యానగర్‌లో కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్‌తో కలిసి నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం 19వ డివిజన్ హరిహరనగర్‌లో కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణగౌడ్‌తో కలిసి రూ.20 లక్షల సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మేయర్ తెలిపారు. చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఇంకుడు గుంతలు,ఫాం పాండ్‌లు



**చిల్పూర్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి గ్రామంలో వనరుల పటం, సామాజిక పటం ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని మండల అధికారులు సూచించారు. చిల్పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన వనరుల పటం, సామాజిక పటాలను సోమవారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పటాల్లో ఇళ్ల వద్ద ఉన్న ఇంకుడు గుంతలు, పొలాల చెరువులు(ఫాం పాండ్ లు), పండ్ల తోటలు తదితర వివరాలను గుర్తించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి కొరతను అధిగమించేందుకు భూగర్భ జలాలను పెంపొందించే చర్యలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబానికి 120 రోజుల ఉపాధి కల్పించేలా అన్ని రకాల పనులను ముందుగానే గుర్తించాలని సూచించారు. గుర్తించిన పనులకు అనుగుణంగా కూలీలను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో గుర్తించిన పనులకు వీబీజీ రామ్‌జీ నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ ప్రసాద్, ఎంపీఓ రఘు రామకృష్ణ, ఏపీవో మోహన్ రావు, ఈసీ సింగపురం కిరణ్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిల్పూర్‌లో సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం





**చిల్పూర్,సెప్టెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** చిల్పూర్ మండల కేంద్రంలోని స్థానిక విద్యా వనరుల కార్యాలయంలో ఎంపీడీవో కిరణ్ ప్రసాద్ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ప్రగతి నివేదికలను వివరించారు.
ఎంపీఓ రఘురామకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమం కింద ప్రభుత్వ కార్యాలయాల్లో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను ఉచితంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ భూమిలో 120 గజాల స్థలంలో సామూహిక పారిశుధ్య సముదాయాలను నిర్మించాలని తెలిపారు. ఒక్కో సముదాయం నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరవుతాయని, ఇందులో 30 శాతం మేర రూ.90 వేలను గ్రామపంచాయతీ భరించేలా తీర్మానం చేస్తే మిగతా రూ.2.10 లక్షలను స్వచ్ఛభారత్ నిధుల నుంచి విడుదల చేస్తామని వివరించారు.
గ్రామాల్లో చెత్తను తప్పనిసరిగా నాలుగు రకాలుగా వేరు చేసి సేకరించాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఉపాధి హామీ పనుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఉద్యోగ కార్డులు లేని వారిని గుర్తించి ఉచితంగా ఉద్యోగ కార్డులు అందిస్తామని తెలిపారు. చిల్పూర్ మండలాన్ని జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో కిరణ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. సమావేశానికి హాజరుకాని శాఖల అధికారుల తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.
మండలంలో వివిధ రకాల తోటలను 54 ఎకరాల్లో సాగు చేస్తూ జిల్లాలో ముందంజలో ఉన్నామని ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మరో 20 ఎకరాలకు రాయితీపై కూరగాయల నారు అందించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి నర్సింగరావు, ఏపీవో మోహన్ రావు, ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి, విద్యుత్ శాఖ ఏఈ సురేష్, ఏపీఎం నరసయ్య గౌడ్, మల్కాపూర్ వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్, సీడీపీఓ, గృహ నిర్మాణ శాఖ ఏఈ, సర్పంచులు ఎనగందుల నరసింహారెడ్డి, తీగల సాంబరాజు యాదవ్, నీల కర్ణాకర్, గుగులోతు దేవేందర్, మల్లం రవీందర్, భూక్య వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే సహకార సంఘం లక్ష్యం




- రుణ బకాయిలు సకాలంలో చెల్లించాలి
- విష్ణువర్ధన్ రెడ్డి, పెద్దమందడి సింగిల్ విండో అధ్యక్షులు

**పెద్దమందడి,సెప్టెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘం పనిచేస్తుందని వనపర్తి జిల్లా పెద్దమందడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. పెద్దమందడి సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు తదితర సేవలను సకాలంలో అందించేందుకు సహకార సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సహకార సంఘం బలోపేతానికి సభ్యులందరూ సహకరించాలని కోరారు. రైతులు సహకార సంఘం నుంచి తీసుకున్న రుణ బకాయిలను సకాలంలో చెల్లించాలని విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు. రుణ బకాయిలు పేరుకుపోకుండా సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అలాగే వ్యాపార రుణాలకు సంబంధించిన బకాయిల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. వరి కొనుగోలు ప్రక్రియపై కూడా సమావేశంలో చర్చించారు. సింగిల్ విండో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వరి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉండే విధంగా సంఘం కార్యకలాపాలను మరింత విస్తరించడంతో పాటు సభ్యులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల అభివృద్ధి, సంఘం పురోగతి పరస్పరం ముడిపడి ఉన్నాయని, రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా ప్రతి నిర్ణయం ఉండాలని అన్నారు. సంఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో) సుధాకర్ మాట్లాడుతూ సంఘం కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సభ్యులకు అవసరమైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. సభ్యుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, సీఈవో సుధాకర్, పెద్దమందడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, సంఘం డైరెక్టర్లు, సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థినికి రావుల రూ.25 వేల ఆర్థికసాయం





**కొత్తకోట,సెప్టెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు పొందిన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన విద్యార్థినికి మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డి రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. కానాయపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు కావాలి రవి కుమార్తె ఇటీవల నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం రూ.25 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించేందుకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని రావుల చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు పలుస శంకర్‌గౌడ్, కానాయపల్లి గ్రామ మాజీ సర్పంచ్ యాదయ్య సాగర్, సర్పంచ్ భర్త సాయిలు, గ్రామ అధ్యక్షుడు హోటల్ రాజు, సీనియర్ నాయకులు శేఖర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, శ్రీనివాసులు సాగర్, ఉపాధ్యాయులు శివనారాయణ, ధనుష్, హరిబాబు, కృష్ణయ్య, మన్యం, చందు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ నిరసన



- హుజురాబాద్‌లో దిష్టిబొమ్మ దగ్ధం.. హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్

**హుజురాబాద్, సెప్టెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ హుజురాబాద్ పట్టణ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. దేవుళ్లను, ప్రాంతాలను విభజిస్తూ మాట్లాడటం ముఖ్యమంత్రి స్థాయికి తగదని అన్నారు. ప్రజల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వ పెద్దలపై ఉందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ, వెంటనే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించేలా నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని బీజేపీ నాయకులు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.
ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, పట్టణ ప్రధాన కార్యదర్శి తిప్పబత్తిని రాజు, సీనియర్ నాయకులు నరాల రాజశేఖర్, అంకటి వాసు, యంసాని శశిధర్, పట్టణ ఉపాధ్యక్షులు యల్ల సంజీవరెడ్డి, ఓడ్నాల విజయ్, పట్టణ కార్యదర్శులు గుర్రం సంతోష్, కొడిమ్యాల పవన్ కుమార్, బొడిగె రాధ, పట్టణ కోశాధికారి క్యాష వెంకటేష్, గంధం అనిల్, తూర్పాటి రామచంద్రం, పురాణం కృష్ణయ్య, తూర్పాటి సురేష్, నీలం రవీందర్, పురాణం రాజు, పర్ధం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## పేదల సొంతింటి కలకు ప్రజా ప్రభుత్వం భరోసా



- రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

**చొప్పదండి, సెప్టెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండల ఎంపీడీవో కార్యాలయంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను అభినందిస్తూ, అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## వెల్టూర్ కు పబ్లిక్ స్కూల్ మంజూరు పట్ల హర్షం

- మంత్రులు, ఎమ్మెల్యేకు టీడీపీ శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు



**పెద్దమందడి,సెప్టెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం పట్ల పెద్దమందడి టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి వెల్టూర్ కు విచ్చేసిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గ్రామానికి పబ్లిక్ స్కూల్ మంజూరు చేయడంతో విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఇదే సందర్భంగా వెల్టూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇవ్వడం సంతోషకరమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యేకు శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పబ్లిక్ స్కూల్ ఏర్పాటు, మండల కేంద్రం హామీతో వెల్టూర్ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




## రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- స్టేషన్ ఘన్‌పూర్‌లో మజ్దూర్ యూనియన్ ఆందోళన

**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** రైల్వే కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్‌లో కార్మికులు ఆందోళన నిర్వహించారు. మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఇంజినీరింగ్ విభాగం కార్యదర్శి ఇల్లందుల రాజేందర్ ఆధ్వర్యంలో పనిముట్ల గదుల వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ట్రాక్ నిర్వహణ కార్మికుల గస్తీని 12 కిలోమీటర్లకు పరిమితం చేయాలని, కీమెన్లకు అదనపు విధులు అప్పగించవద్దని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అదనపు పని భత్యం, ప్రయాణ భత్యం, సెలవుల నగదీకరణ, పిల్లల విద్యా భత్యాలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

రాత్రి గస్తీ విధులకు ఇద్దరు పెట్రోల్‌మెన్‌లను నియమించాలని, పీఎల్‌బీపై ఉన్న రూ.7 వేల పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చైర్మన్ కొంగర బిక్షపతి, సహాయ కార్యదర్శులు కరుణ, నరసింహస్వామి, దేవయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సమీకృత కలెక్టరేట్ ప్రారంభానికి సర్వం సిద్ధం





- సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నూతన కలెక్టరేట్
- పర్యటన నేపథ్యంలో భద్రత, పార్కింగ్, సౌకర్యాలపై అధికారులకు సూచనలు

**కరీంనగర్, సెప్టెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనం ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన పరిపాలనా సేవలు అందించేందుకు సిద్ధమైంది. ఈ భవనాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే శ్రీ మేడిపల్లి సత్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ సత్తు మల్లేశం, మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బొమ్మ శ్రీరామ్, సుడా చైర్మన్ శ్రీ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ శ్రీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ నూతన కలెక్టరేట్‌ను సమగ్రంగా పరిశీలించారు. భవనంలోని వివిధ ప్రభుత్వ విభాగాలు, కలెక్టర్ ఛాంబర్, సమావేశ మందిరం, ప్రధాన ద్వారం, తెలంగాణ తల్లి విగ్రహ ప్రాంగణం, హెలిప్యాడ్, పచ్చదనం ఏర్పాట్లను వారు పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా పారిశుద్ధ్యం, భద్రత, పార్కింగ్, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చే ఈ సమీకృత కలెక్టరేట్ జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువుగా నిలవనుంది. ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో ఇది కీలకంగా మారనుందని డా. కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. రేపటి ప్రారంభోత్సవం కరీంనగర్ జిల్లా అభివృద్ధిలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# దానం నాగేందర్‌పై అనర్హత.. ప్రజాస్వామ్యం గెలిచింది

- పార్టీ ఫిరాయింపులపై కోర్టు తీర్పు కీలక పరిణామం: మాచర్ల గణేష్
- కడియం శ్రీహరి విషయంలోనూ ఇదే న్యాయం జరగాలి
- ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం సుగమం
- స్టేషన్ ఘన్‌పూర్‌లోనూ ఉప ఎన్నిక వస్తే గులాబీ జెండా ఎగరడం ఖాయం



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వ్యవహారంలో న్యాయస్థానాల తీర్పు ప్రజాస్వామ్యానికి, పార్టీ ఫిరాయింపుల నిరోధక నిబంధనలకు ప్రాధాన్యతను చాటిందని స్టేషన్ ఘన్‌పూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్ అన్నారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరారని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారని ఆయన తెలిపారు. ఈ వ్యవహారంపై దాఖలైన అనర్హత పిటిషన్లలో తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్‌పై అనర్హత వేటు విధించగా, దానిని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోకపోవడంతో అనర్హత నిర్ణయం కొనసాగిందన్నారు. సెప్టెంబర్ 28న ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు తెలంగాణ శాసనసభ అధికారికంగా ప్రకటించడంతో ఉప ఎన్నికకు మార్గం సుగమమైందని గణేష్ పేర్కొన్నారు.

ఈ పరిణామం నేపథ్యంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యవహారం కూడా మరోసారి చర్చకు వచ్చిందన్నారు. 2023లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి అనంతరం కాంగ్రెస్‌లో చేరారని, ఆయనపై కూడా అనర్హత పిటిషన్ దాఖలైందని తెలిపారు. మార్చి 2026లో స్పీకర్ కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేసినప్పటికీ, దానం నాగేందర్ కేసులో అనంతరం హైకోర్టు, సుప్రీంకోర్టు స్థాయిలో పరిణామాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.

దానం నాగేందర్ వ్యవహారంలో వెలువడిన న్యాయపరమైన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని కడియం శ్రీహరి విషయంలోనూ ఇదే విధమైన న్యాయం జరగాలని మాచర్ల గణేష్ కోరారు.

కడియం శ్రీహరి పార్టీ మారడం ద్వారా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఏమి సాధించారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కేవలం కాంట్రాక్టులు, రోడ్ల పనులకే పరిమితం కాకుండా రైతులు, పేదలు, విద్య, వైద్యం, సంక్షేమం, రైతుబీమా, రైతుబంధు వంటి ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధిపై ఉందన్నారు.

నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు సాధించడమే ప్రజాప్రతినిధి ప్రధాన బాధ్యత అని గణేష్ పేర్కొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లోనూ ఉప ఎన్నిక జరిగే పరిస్థితి వస్తే బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు లభిస్తుందని, గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# టీఎస్ఈఈయూ 327 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగాల శ్రీధర్



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎస్ఈఈయూ 327 సంఘం క్రియాశీలక పాత్ర పోషిస్తోందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగాల శ్రీధర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ విభాగ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఘన్‌పూర్ విభాగ కార్యవర్గ సభ్యులను డీఈ బి.సారయ్యకు పరిచయం చేశారు.

ఈ సందర్భంగా బి.సారయ్య మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. సీఎండీ ప్రవేశపెట్టిన 'ఒక నిమిషం నిబంధన'ను పాటిస్తూ విధుల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

అనంతరం ఇనుగాల శ్రీధర్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనగామ ప్రాంతం 327 సంఘానికి కంచుకోటగా ఉందన్నారు. పీఆర్సీతో పాటు ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీతో కలిసి పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈపీఎఫ్ పరిధిలోని ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు చేయించేందుకు సంజీవరెడ్డి నేతృత్వంలో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సీనియర్ కార్యనిర్వాహక అధ్యక్షుడు నీలం ఐలేష్, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్‌రెడ్డి, కార్యదర్శి కె.శ్రీనివాస్, సంఘటిత కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బి.వీరాంజనేయులు, కార్యదర్శి సీహెచ్.నరేందర్‌రెడ్డి, సీనియర్ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.రాజ్‌కుమార్, జనగామ విభాగ అధ్యక్షుడు ఎం.మహేందర్, కార్యదర్శి కె.విజయ్‌కుమార్, ఘన్‌పూర్ విభాగ నూతన అధ్యక్షుడు వాసం శ్రీధర్, కార్యదర్శి మహమ్మద్ ఫయాజ్, కోశాధికారి జి.కృష్ణంరాజు, సీనియర్ కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.సందీప్, కార్యనిర్వాహక అధ్యక్షులు డి.సాంబరాజు, బి.శరత్, ఉపాధ్యక్షులు ఎస్.అర్చన, వి.ప్రభాకర్, ఎం.వెంకన్న, ఎస్.రమ్య, అదనపు కార్యదర్శి ఎన్.గిరి, సంయుక్త కార్యదర్శి ఎ.సుధాకర్, కార్యాలయ కార్యదర్శి ఎం.మహేందర్, 327 ట్రాన్స్‌కో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతకోటి మల్లేష్, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, వీరస్వామి, లక్ష్మి, లక్ష్మణ్, వెంకటేష్, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

## ధ్యాన గురువు చింత అనిల్ కుమార్‌కు అభినందనలు

- ప్రజల ఆరోగ్యానికి ధ్యానం ఎంతో దోహదం: చందుపట్ల జనార్ధన్



**హుజురాబాద్, సెప్టెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలోని స్థానిక కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో తాళ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో జ్ఞానబోధకుడు, ధ్యాన గురువు చింత అనిల్ కుమార్ నిర్వహించిన ధ్యాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హుజురాబాద్ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, ధ్యాన గురువు చింత అనిల్ కుమార్‌ను అభినందించారు.ఈ సందర్భంగా బీసీ జేఏసీ అధ్యక్షుడు సందేల వెంకన్న మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని తన బాధ్యతగా భావించి చింత అనిల్ కుమార్ గత కొన్ని నెలలుగా హుజురాబాద్ పట్టణంలో నిరంతరం ధ్యాన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ధ్యానం ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందడంతో పాటు జీవనశైలిలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని తెలిపారు. కలుషితమైన వాతావరణం, ఆధునిక జీవన విధానం కారణంగా ప్రజలు అనేక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిరోజూ కొంత సమయం ధ్యానానికి కేటాయించడం అవసరమని సూచించారు.ప్రజలు ధ్యానం పట్ల ఆసక్తిని పెంచుకుని క్రమం తప్పకుండా ధ్యాన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ధ్యానాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకుని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సద్గురు వంటి ధ్యాన గురువులను ఆదర్శంగా తీసుకుని ఆధ్యాత్మికత, ధ్యానం పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని అన్నారు.కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ధ్యాన కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, ఆకుల సదానందం, కన్నెబోయిన రాజయ్య, షీలా రాజేంద్రప్రసాద్, బజాజ్ రవీందర్ రెడ్డి తదితరులతో పాటు అధిక సంఖ్యలో ధ్యాన పరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మత్తు వద్దు.. భవిష్యత్తు ముద్దు!

- హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ సదస్సు



**హుజురాబాద్,సెప్టెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎక్సైజ్ అధికారులు విద్యార్థులకు సూచించారు. హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సుగుణ అధ్యక్షతన 'నశాముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా యాంటీ డ్రగ్స్ సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హుజురాబాద్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని అన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం తీవ్రంగా ప్రభావితమవుతాయని వివరించారు.

ఎక్సైజ్ ఎస్ఐ సురేష్ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, వాటి వినియోగం వల్ల ఎదురయ్యే సామాజిక సమస్యలు, చట్టపరమైన శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమకంటే పెద్దవారితో అనవసర స్నేహాలు చేయకుండా, చెడు వ్యసనాలకు బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో మంచి అలవాట్లను అలవర్చుకుని విద్య, క్రమశిక్షణ, లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని అధికారులు తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆబాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

# సర్వాయిపేటలో నూతన రైతు సంఘం ఏర్పాటు



- **రైతుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**సైదాపూర్,సెప్టెంబర్ 29( తెలంగాణ ముచ్చట్లు ):**సర్వాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని శివరాంపల్లి లో నూతన రైతు సంఘాన్ని ఏర్పాటు చేశారు. రైతుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం గ్రామానికి చెందిన రైతులు ఈ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడిగా సంపత్ సంజీవ రెడ్డి, అధ్యక్షుడిగా కొనుపుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చెన్నబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గొడుగు బాబు, కోశాధికారిగా సయ్యద్ సర్దార్, కార్యదర్శిగా జెల్ల మొగిలి, సహకార కార్యదర్శిగా గొట్టె రమేశ్ను ఎన్నుకున్నారు.అలాగే మరో ఏడుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు రైతుల సంక్షేమం కోసం సంఘం పని చేస్తుందని సభ్యులు తెలిపారు.

# అక్టోబర్ 7న రవీంద్రభారతిలో ఆర్‌టీఐ అవగాహన సదస్సు



- **పోస్టర్‌ను ఆవిష్కరించిన కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి**

**హుజురాబాద్,సెప్టెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అక్టోబర్ 7, 2026న నిర్వహించనున్న అవగాహన సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు ఉద్దేశాలు, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలపై నాయకులు చర్చించారు.

**ప్రజలకు ఆర్‌టీఐ చట్టంపై అవగాహన అవసరం**

సమాచార హక్కు చట్టం ప్రజలకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన చట్టబద్ధమైన హక్కుల్లో ఒకటని, ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై అవసరమైన సమాచారాన్ని చట్టబద్ధంగా తెలుసుకునే అవకాశం ప్రజలకు ఉందని నాయకులు పేర్కొన్నారు. ఆర్‌టీఐ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడంతో పాటు, చట్టాన్ని ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై కూడా ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

**రవీంద్రభారతి సదస్సును విజయవంతం చేయాలి**

అక్టోబర్ 7న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్న సమాచార హక్కు చట్టం సాధన కమిటీ అవగాహన సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, ఆర్‌టీఐ కార్యకర్తలు, సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. సమాచార హక్కు చట్టంపై మరింత లోతైన అవగాహన పెంపొందించేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని తెలిపారు.

**పలువురు నాయకుల హాజరు**

పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బండ నరేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దాట్ల శ్రీనివాస్, హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున, హుజురాబాద్ మండల కన్వీనర్ పిట్ట శ్రీనివాస్,ఆలుపుల రాజ్ కుమార్, శనిగరం రవిందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్టోబర్ 7న జరిగే అవగాహన సదస్సును విజయవంతం చేసేందుకు అందరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

# దానం నాగేందర్ అనర్హత ప్రజాస్వామ్య విజయం

- **బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్**



**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటం ప్రజాస్వామ్య విజయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ అన్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి ఈ పరిణామం మరింత బలం చేకూర్చిందని పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని గణేష్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు ఆయనను అనర్హుడిగా ప్రకటించగా, అనంతరం సుప్రీంకోర్టులోనూ ఆయనకు ఉపశమనం లభించలేదని తెలిపారు. దీంతో ఖైరతాబాద్ శాసనసభ స్థానం ఖాళీగా మారినట్లు అధికారిక ప్రక్రియ పూర్తయింది.ఇదే తరహాలో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కూడా ఇదే న్యాయం జరగాలని గణేష్ డిమాండ్ చేశారు. కడియం శ్రీహరి పార్టీ మారడం వల్ల నియోజకవర్గానికి ఏం సాధించారో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు.ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికకు మార్గం సుగమమైందని పేర్కొన్న గణేష్, స్టేషన్ ఘన్‌పూర్‌లోనూ ఉప ఎన్నిక వస్తే తమ పార్టీ విజయానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని ధీమా వ్యక్తం చేశారు.

# ఆర్టీఐ అవగాహన సదస్సుకు సమాచార కమిషనర్లకు ఆహ్వానం

- **తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్లను కలిసిన సమాచార హక్కు చట్టం సాధన కమిటీ**





**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 7న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న సమాచార హక్కు చట్టం-2005 ఆవిర్భావ దినోత్సవం, అవగాహన సదస్సుకు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్లను ఆహ్వానించారు.

కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయాన్ని సందర్శించి సమాచార కమిషనర్లను కలిశారు. ఈ సందర్భంగా అక్టోబర్ 7న నిర్వహించనున్న సదస్సు ఉద్దేశాలు, కార్యక్రమ ప్రణాళిక, ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

రాష్ట్ర సమాచార కమిషనర్లు దేశాల భూపాల్, పి.వి. శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, మెర్ల వైష్ణవిలను కలిసి అధికారిక ఆహ్వాన పత్రాలను అందజేశారు.సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు తమ సమాచార హక్కుపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం, ప్రజలు తమ హక్కులను చట్టబద్ధంగా వినియోగించుకునేలా చైతన్యం కల్పించడం సదస్సు ప్రధాన ఉద్దేశ్యమని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అక్టోబర్ 7న జరిగే సదస్సులో జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, నియోజకవర్గ, గ్రామ స్థాయి ప్రతినిధులతో పాటు సమాచార హక్కు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలు, ప్రజల భాగస్వామ్యం, సమాచార హక్కు వినియోగంపై అవగాహన తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి రావుల నవీన్‌కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ. శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌రామ్‌సింగ్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరం



**జమ్మికుంట, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణాన్ని నిత్యం పరిశుభ్రంగా, సుందరంగా ఉంచేందుకు నిరంతరం విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్ల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రత్యేక వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సందర్శించి వైద్య పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య శిబిరంలో తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఒకరి ఆరోగ్యంపై వారి కుటుంబం ఆధారపడి ఉంటుందని, అందువల్ల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

విధులు నిర్వహించే సమయంలో పారిశుధ్య కార్మికులు తప్పనిసరిగా మాస్కులు, గ్లౌజులు ధరించాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ విధులు నిర్వహించాలని చైర్మన్ పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మొలుగు చందన, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.





# కేజీబీవీలో ఆకలి కష్టాలు.. విద్యార్థినుల కన్నీటి గోడు

- **నెల రోజులుగా సరుకుల కొరత.. అల్పాహారం, పౌష్టికాహారం అందడం లేదని ఫిర్యాదు**

**పెద్దమందడి,సెప్టెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులు ఆహార కొరతతో ఇబ్బందులు పడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. నెల రోజులుగా నిత్యావసర సరుకులు సక్రమంగా అందకపోవడంతో అల్పాహారం, భోజనం, పౌష్టికాహారం సరిగా అందడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల సమక్షంలో కన్నీళ్లతో తమ సమస్యలను వెల్లడించారు.

**ఆకస్మిక తనిఖీలో వెలుగులోకి..**

తల్లిదండ్రుల ఫిర్యాదుతో పెద్దమందడి సర్పంచ్ సూర్య గంగమ్మ రవి, క్లస్టర్ హెడ్‌మాస్టర్ శాంతన్నతో కలిసి మంగళవారం కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం అల్పాహారంతో పాటు గుడ్లు, పండ్లు, స్నాక్స్, చాయ్, పాలు సక్రమంగా అందడం లేదని విద్యార్థినులు తెలిపారు. వంటకు అవసరమైన ఉప్పు, పసుపు వంటి సరుకులు లేకపోవడంతో వంట సిబ్బంది సొంత ఖర్చుతో స్థానిక దుకాణాల నుంచి తెస్తున్నారని చెప్పారు.

**చాలీచాలని అన్నం.. నాణ్యత లేని కూరగాయలు**

వండిన పప్పు, సాంబార్‌ను సర్పంచ్ పరిశీలించి నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్నం సరిపడా వండకపోవడంతో కొందరు విద్యార్థినులకు భోజనం అందని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉన్న టమాటాల్లో చాలావరకు కుళ్లిపోయినవి ఉండటంపై కూడా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఏజెన్సీల ఒప్పందం ముగియడంతో సమస్య:**

జీసీడీవో కేజీబీవీలకు సరుకులు సరఫరా చేసే ఏజెన్సీల ఒప్పందాలు ఆగస్టుతో ముగియడంతో సరఫరా నిలిచిపోయిందని జీసీడీవో ఇందిరాదేవి తెలిపారు. ప్రభుత్వం రెండు విడతల్లో సరుకులు పంపించాలని ఆదేశించినప్పటికీ, రాష్ట్రస్థాయి ఏజెన్సీల నుంచి స్పందన లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయని వివరించారు.విద్యార్థుల చదువుతో పాటు వారి ఆహారం, ఆరోగ్యం, పౌష్టికాహారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# కేంద్రంపై.. రాజ్యాంగ వ్యవస్థలపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- **ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం**
- **ప్రజా తీర్పును కాంగ్రెస్ గౌరవించాలి**
- **ఎన్నికల కమిషన్ స్వతంత్రతను ప్రశ్నించడం సరికాదు:యాదగిరి సునీల్‌రావు**



**కరీంనగర్, సెప్టెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు, రాజ్యాంగ వ్యవస్థలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆరోపించారు. కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

గతంలో ఈవీఎంలను లక్ష్యంగా చేసుకున్న కాంగ్రెస్.. ప్రస్తుతం సర్ ప్రక్రియపై అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధంగా చేపడుతున్న ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శించడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి, అవసరమైన పత్రాలను ధ్రువీకరించిన అనంతరం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తున్నారని తెలిపారు.

ఒక పౌరుడికి ఒకే ప్రాంతంలో ఓటు హక్కు ఉండాలన్న నిబంధనల మేరకు ఎన్నికల కమిషన్ తన బాధ్యతలను నిర్వహిస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు నిజమైతే ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో ఎలా విజయం సాధించాయని ప్రశ్నించారు.

రాముడు.. శివుడిని రాజకీయాల్లోకి లాగొద్దు,కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలు, సర్ తర్వాత ఇప్పుడు రాముడు, శివుడి పేర్లతో రాజకీయాలు చేస్తోందని సునీల్‌రావు విమర్శించారు. రాముడు, శివుడు వేర్వేరు కాదని, హిందూ ధర్మంలో వారి ఏకత్వాన్ని శాస్త్రాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కాశీ విశ్వనాథ్ ధామ్ పునర్నిర్మాణం జరిగిందని తెలిపారు.

కాంగ్రెస్ ఎన్ని ఆరోపణలు, విమర్శలు చేసినా ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని సునీల్‌రావు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు బండారి వేణు, బండ రమణారెడ్డి, మేకల వెంకటేష్, భూపతి రవీందర్, రామన్, నాంపల్లి శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, దేవసాని సత్యనారాయణ, సర్దార్ బల్విందర్ సింగ్, మహమ్మద్ ముజీబ్, పండుగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బుధవారం - 30 - సెప్టెంబర్ - 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎరుకల సమస్యలపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి

- ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు మంగరాయి వెంకటేష్



**వనపర్తి,సెప్టెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):**ఎస్టీల సమస్యల పరిష్కారంపై వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను ఎరుకల సంక్షేమ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మంగరాయి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎరుకల సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, విద్య, ఉపాధి, నివాసం తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఎరుకల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారికి విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని మంగరాయి వెంకటేష్ కోరారు. ఎరుకల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి సమస్యలను విన్నవించారు. అనంతరం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను మంగరాయి వెంకటేష్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎరుకల సంక్షేమ సంఘం తరపున తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎరుకల సంక్షేమం, అభివృద్ధి కోసం భవిష్యత్‌లోనూ సంఘం తరపున నిరంతరం కృషి చేస్తామని మంగరాయి వెంకటేష్ పేర్కొన్నారు.

# రెడ్డి జాగృతి స్టేషన్ ఘనపూర్ మండల అధ్యక్షుడిగా చల్ల రఘు రెడ్డి



**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** రెడ్డి జాగృతి స్టేషన్ ఘనపూర్ మండల అధ్యక్షుడిగా చల్ల రఘు రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టం మాధవరెడ్డి, వ్యవస్థాపక సభ్యుడు నీరీడు దయాకర్ రెడ్డి, జాతీయ అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్ రెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు కర్రెడ్డి రఘునందన్ రెడ్డి సంయుక్తంగా నియామక పత్రాన్ని అందజేశారు.రెడ్డి సామాజిక వర్గ ఐక్యత, సంక్షేమం కోసం కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. నూతన మండల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన చల్ల రఘు రెడ్డికి రెడ్డి జాగృతి నాయకులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించిన జిల్లా కమిటీ సభ్యులకు చల్ల రఘు రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ లక్ష్యాల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ఘనంగా మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ జన్మదిన వేడుకలు



**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఓ బేకరీలో కౌన్సిలర్లు తాటికొండ మధు, బూర్ల రాజేశ్వర్, పొన్న రాజేష్, బలగాని అనిల్ కలిసి రాధాకృష్ణను శాలువాతో సన్మానించారు.అనంతరం కేక్ కట్ చేయించి పరస్పరం తినిపించుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ రాధాకృష్ణ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి వాలీబాల్‌లో వెల్టూరు విద్యార్థుల సత్తా

- ద్వితీయ బహుమతి కైవసం.. విద్యార్థులకు అభినందనలు



**పెద్దమందడి,సెప్టెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అమడబాకులలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో జెడ్పీహెచ్ఎస్ వెల్టూర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించారు. జట్టు కెప్టెన్ కుమారి యశ్వంతిక ఆధ్వర్యంలో విద్యార్థులు సమన్వయంతో ఆటను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రవి కుమార్, జట్టు కెప్టెన్ యశ్వంతికతో పాటు జట్టు సభ్యులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాణం విష్ణు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. జిల్లా స్థాయిలో సాధించిన ఈ విజయంతో పాఠశాల విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నెలకొందని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, వెల్టూరు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించిన వెల్టూరు పాఠశాల విద్యార్థులపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, క్రీడల్లో మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో సత్తా చాటడం గ్రామానికి గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు.

# హిందూ ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు

- సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి
- నుస్తలాపూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 29(తెలంగాణ ముచ్చట్లు ):** హిందూ దేవుళ్లను అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ తిమ్మాపూర్ మండల బీజేపీ ఆధ్వర్యంలో నుస్తలాపూర్ రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, హిందూ సమాజానికి సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హిందూ ధర్మానికి అవమానం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ మావురపు సంపత్‌కుమార్, మండల జనరల్ సెక్రటరీ గొట్టిముక్కుల తిరుపతి రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు అరుణ్ గడ్డం, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ఎల్కపెల్లి స్వామి, కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ బుర్ర శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# వెల్టూర్‌ను మండల కేంద్రంగా చేస్తామన్న మంత్రి హామీపై హర్షం



- దిండు రవీందర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్

**పెద్దమందడి, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం, భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగడం పట్ల కాంగ్రెస్ నాయకుడు, పెద్దమందడి మార్కెట్ యార్డు డైరెక్టర్ దిండు రవీందర్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో వెల్టూర్‌తో పాటు పరిసర గ్రామాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి దిండు రవీందర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం వెల్టూర్ విద్యాభివృద్ధికి ముఖ్యమైన ముందడుగని అన్నారు. అదేవిధంగా వెల్టూర్ గ్రామాన్ని భవిష్యత్‌లో మండల కేంద్రంగా చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన హామీపై దిండు రవీందర్ హర్షం వ్యక్తం చేశారు. మంత్రి హామీ నెరవేరితే వెల్టూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు పరిపాలనా సౌకర్యాలు మరింత చేరువవుతాయని తెలిపారు. వెల్టూర్ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# మోజర్ల ఉద్యానవన కళాశాలలో గ్రాడ్యుయేషన్, ఫ్రెషర్స్ డే వేడుకలు

- ఫ్రెషర్స్ డేలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు.. ప్రతిభావంతులకు పురస్కారాలు



**పెద్దమందడి,సెప్టెంబర్29(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్లలోని ఉద్యానవన కళాశాల పరిధిలోని కొల్లాపూర్ ఉద్యానవన పాలిటెక్నిక్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకలు, ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్‌కేఎల్‌టీజీహెచ్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా. నటరాజన్ శ్రీనివాసన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డా. నటరాజన్ శ్రీనివాసన్ మాట్లాడుతూ డిప్లొమా విద్య ప్రాధాన్యతను వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో డిప్లొమా విద్య కీలకమని తెలిపారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఉద్యానవన రంగం రైతులు, వినియోగదారులు, సమాజంతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉందని పేర్కొంటూ.. విద్యార్థులు ప్రాయోగిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయం, పరిశ్రమల్లో ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మక ఆలోచనలతో పరిష్కారాలు కనుగొనే దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.అసోసియేట్ డీన్ డా. వీణా జోషి డిప్లొమా పూర్తి చేసిన గ్రాడ్యుయేట్ విద్యార్థులను అభినందించి, వారి భవిష్యత్ విద్యా, వృత్తి జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా కళాశాలలో చేరిన ఫ్రెషర్స్‌కు స్వాగతం పలికి, క్రమశిక్షణ, జ్ఞానం, ప్రాయోగిక నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీల్లో విజేతలకు పతకాలు, అకడమిక్ టాపర్లకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంప్రదాయ, ఆధునిక నృత్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, గ్రాడ్యుయేట్ విద్యార్థులు, ఫ్రెషర్స్, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కడియం చేసిన అభివృద్ధి శూన్యం.. రాజీనామా చేసి ఎన్నికలకు రా!

- అభివృద్ధి పేరుతో ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు..
- కడియం అసలు లక్ష్యం మంత్రి పదవే
- దళితులకు చేసిందేమీ లేదు..
- కడియంపై తాటికొండ రాజయ్య ధ్వజం

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాకుండా మంత్రి పదవి కోసమే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరారని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఆరోపించారు. తన కూతురిని వెంటబెట్టుకుని అభివృద్ధి పేరుతో ఢిల్లీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. 25 మంది ఎమ్మెల్యేలను తన వెంట తీసుకొస్తే మంత్రి పదవి ఇస్తారన్న ఆశతో కాంగ్రెస్‌లోకి వెళ్లారని, అయితే చివరకు పది మంది ఎమ్మెల్యేలు కూడా ఆయన వెంట రాకపోవడంతో ఆశలు అడియాశలయ్యాయని ఎద్దేవా చేశారు.

**'దళిత దొర' బిరుదు ఒక్కటే సాధించారు**

తాను దళితుడినని చెప్పుకునే కడియం శ్రీహరి ఘనపూర్ లేదా పర్వతగిరి ప్రాంతాల్లో దళితుల కోసం చేసిందేమీ లేదని రాజయ్య విమర్శించారు. కులాన్ని అడ్డుపెట్టుకుని అనేక రాజకీయ పదవులు అనుభవించినప్పటికీ, ఒక్క దళితుడిని కూడా రాజకీయంగా, సామాజికంగా ఎదిగేలా చేయలేదని ఆరోపించారు. కడియం శ్రీహరి సాధించింది ఏమైనా ఉందంటే అది 'దళిత దొర' అనే బిరుదు మాత్రమేనని ఎద్దేవా చేశారు.కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై పదేపదే విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. రాజ్యాంగంపై గౌరవం ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎన్నికల బరిలోకి రావాలని కడియం శ్రీహరికి రాజయ్య సవాల్ విసిరారు.

**ఘనపూర్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సవాల్**

ఘనపూర్ నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని రాజయ్య పేర్కొన్నారు. జనగామ జిల్లా ఏర్పాటు, ఘనపూర్ రెవెన్యూ డివిజన్, ఆరోగ్య విశ్వవిద్యాలయం, వంతెన, పాలిటెక్నిక్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలు, కస్తూర్బా పాఠశాలలు, వేలాది ఇందిరమ్మ ఇళ్లు, చెరువుల మరమ్మతులు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు కేసీఆర్ ఆశీస్సులతోనే సాధ్యమయ్యాయని తెలిపారు.కడియం శ్రీహరి తన హయాంలో జరిగిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని, అంబేడ్కర్ విగ్రహం వద్ద బహిరంగ చర్చకు రావాలని రాజయ్య డిమాండ్ చేశారు. తాను స్థానికుడిగా ప్రజాబలంతో నాలుగుసార్లు భారీ మెజారిటీతో గెలిచానని, కడియం శ్రీహరి ఎత్తులు, కుట్రలతో తప్ప ప్రజాబలంతో గెలవలేదని ఆరోపించారు. రాబోయే రోజుల్లో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కడియం రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని రాజయ్య వ్యాఖ్యానించారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# డేటింగ్ ఉచ్చులో యువకుడు



- యాప్ పరిచయం.. పబ్‌లో రూ.29 వేల బిల్లు
- హనీట్రాప్ అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలో డేటింగ్ యాప్‌ల ముసుగులో జరుగుతున్న మోసాలపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది. డేటింగ్ యాప్ ద్వారా పరిచయమైన యువతితో కలిసిన ఓ యువకుడు పబ్‌లో ఏకంగా రూ.29 వేల బిల్లు చెల్లించాల్సి వచ్చిన ఘటన జూబ్లీహిల్స్‌లో వెలుగుచూసింది. ఈ ఘటన సామాజిక మాధ్యమాలు, నగర వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. డిజిటల్ పరిచయాల వెనుక దాగి ఉన్న మోసపూరిత వలలపై మరోసారి హెచ్చరికగా ఈ సంఘటన నిలిచింది. హేమంత్ అనే యువకుడికి డేటింగ్ యాప్ ద్వారా దివ్య అనే యువతి పరిచయమైంది. కొంతకాలం సంభాషణల అనంతరం ఇద్దరూ జూబ్లీహిల్స్‌లోని ఓ వినోద కేంద్రంలో కలుసుకున్నారు. అయితే అక్కడ కొద్దిసేపు గడిచిన తర్వాత భారీ మొత్తం బిల్లు రావడంతో హేమంత్ ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యాడు. సాధారణ ఖర్చులతో పోలిస్తే అసాధారణంగా అధికంగా ఉన్న బిల్లుపై అతడు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఈ వ్యవహారం యాదృచ్ఛికం కాదని, ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగిందని బాధితుడు అనుమానం వ్యక్తం చేశాడు. యువతి, వినోద కేంద్రం నిర్వాహకుల మధ్య కుమ్మక్కు ఉండొచ్చని ఆరోపిస్తూ తాను మోసపోయానని పేర్కొన్నాడు. తనను ఉద్దేశపూర్వకంగా అక్కడికి రప్పించి ఆర్థికంగా నష్టపరిచే ప్రయత్నం జరిగిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించినట్లు తెలిసింది. ఫిర్యాదు అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంబంధిత వ్యక్తుల వివరాలు, ఆ రోజు జరిగిన లావాదేవీలు, వినోద కేంద్రంలో నమోదైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. సీసీ దృశ్యాలు, చెల్లింపు వివరాలు, ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలు వెలికితీయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

ఇటీవలి కాలంలో డేటింగ్ యాప్‌ల ద్వారా పరిచయమై మోసాలకు పాల్పడుతున్న ఘటనలు పలు నగరాల్లో వెలుగుచూస్తున్నాయి. అపరిచితులతో సమావేశాలు ఏర్పాటు చేసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే అప్రమత్తం కావాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యక్తిగత వివరాలు, ఆర్థిక సమాచారం పంచుకోవడంలో మరింత జాగ్రత్త అవసరమని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం కేసు విచారణ కొనసాగుతున్నందున ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం స్పష్టమయ్యే అవకాశం ఉంది. డిజిటల్ వేదికల ద్వారా ఏర్పడే పరిచయాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోందని పోలీసులు పేర్కొంటున్నారు.

# శాశ్వత రసాయనాల చెరలో మానవాళి

ఒకప్పుడు ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచానికి అతిపెద్ద పర్యావరణ సవాలుగా కనిపించింది. తరువాత మైక్రోప్లాస్టిక్స్ మానవ రక్తంలో, ఊపిరితిత్తుల్లో, గర్భనాళంలో కూడా గుర్తించబడటంతో ప్రపంచం ఉలిక్కిపడింది. ఇప్పుడు శాస్త్రవేత్తలు మరింత తీవ్రమైన ప్రమాదం గురించి హెచ్చరిస్తున్నారు. అదే పీఎఫ్ఏఎస్ (పర్ అండ్ పాలీ ఫ్లోరోఆల్కైల్ సబ్‌స్టాన్సెస్) అనే "శాశ్వత రసాయనాలు". ఇవి కనిపించవు, వాసన రావు, రుచి తెలియదు. కానీ ప్రకృతిలోనూ, మానవ శరీరంలోనూ దశాబ్దాలపాటు నిలిచి ఉండే ప్రమాదకర లక్షణం వీటికి ఉంది.



1940ల నుంచే పరిశ్రమల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్న ఈ రసాయనాలు నాన్‌స్టిక్ వంటపాత్రలు, నీరు చొరబడని దుస్తులు, ఆహార ప్యాకేజింగ్ పదార్థాలు, సౌందర్య ఉత్పత్తులు, అగ్నిమాపక నురుగులు, కాగిత పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీలో ఉపయోగించబడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 10,000కు పైగా రకాల పీఎఫ్ఏఎస్ సమ్మేళనాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటి అణు నిర్మాణం అత్యంత స్థిరంగా ఉండటం వల్ల ప్రకృతి వాటిని సులభంగా విచ్ఛిన్నం చేయలేకపోతోంది.

ఈ రసాయనాల అసలు ప్రమాదం వాటి విస్తృత వ్యాప్తిలో ఉంది. తాగునీరు, చేపలు, పాల ఉత్పత్తులు, ప్యాక్ చేసిన ఆహారం, గాలి, గృహోపకరణాల ద్వారా పీఎఫ్ఏఎస్ మన శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. అమెరికాలో నిర్వహించిన అధ్యయనాల ప్రకారం దాదాపు 97 శాతం మంది ప్రజల రక్తంలో పీఎఫ్ఏఎస్ ఆనవాళ్లు గుర్తించబడ్డాయి. ఇది ఆధునిక నాగరికత ఎంత లోతుగా ఈ రసాయనాల ప్రభావంలోకి వెళ్లిపోయిందో తెలియజేస్తోంది.

పీఎఫ్ఏఎస్ ప్రభావంపై నిర్వహించిన పరిశోధనలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని రకాల క్యాన్సర్లు, థైరాయిడ్ సమస్యలు, కాలేయ వ్యాధులు, కొలెస్ట్రాల్ పెరుగుదల, రోగనిరోధక శక్తి క్షీణత, పిల్లల ఎదుగుదలలో ఆటంకాలు, సంతానోత్పత్తి సమస్యలతో వీటి సంబంధం ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు మరియు గర్భిణులు అత్యంత సున్నితమైన వర్గాలుగా భావిస్తున్నారు.

అభివృద్ధి చెందిన దేశాలు ఈ విషయంలో అప్రమత్తమయ్యాయి. అమెరికా పర్యావరణ పరిరక్షణ సంస్థ తాగునీటిలో అత్యంత ప్రమాదకరమైన పీఎఫ్ఏఎస్ రసాయనాలకు 4 పార్ట్స్ పర్ ట్రిలియన్ అనే అత్యంత కఠిన పరిమితిని విధించింది. అనేక నీటి శుద్ధి కేంద్రాలు భారీ పెట్టుబడులతో కొత్త శుద్ధి సాంకేతికతలను అమలు చేస్తున్నాయి. యూరోపియన్ దేశాలు కూడా పీఎఫ్ఏఎస్ వినియోగాన్ని తగ్గించేందుకు కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయి.

యూరప్‌లో నిర్వహించిన పరిశోధనలు మరింత భయానక చిత్రాన్ని చూపిస్తున్నాయి. పర్యవేక్షించిన నదీ ప్రాంతాల్లో 59 శాతం, సరస్సుల్లో 35 శాతం, తీరప్రాంత జలాల్లో 73 శాతం వరకు పీఎఫ్ఏఎస్ కాలుష్యం భద్రతా ప్రమాణాలను అధిగమించింది. యూరోపియన్ పర్యావరణ సంస్థ దీనిని భవిష్యత్ ప్రజారోగ్యానికి మరియు జీవవైవిధ్యానికి తీవ్రమైన ముప్పుగా అభివర్ణించింది. భారతదేశంలో మాత్రం ఈ సమస్యపై ఇంకా తగిన స్థాయి చర్చ, పరిశోధన, పర్యవేక్షణ, నియంత్రణలు కనిపించడం లేదు. మన దేశంలో పారిశ్రామికీకరణ వేగంగా పెరుగుతోంది. ప్యాకేజింగ్ వినియోగం, రసాయన ఉత్పత్తుల వినియోగం కూడా విస్తరిస్తున్నాయి. అయినప్పటికీ తాగునీరు, భూగర్భజలాలు, వ్యవసాయ ఉత్పత్తుల్లో పీఎఫ్ఏఎస్ స్థాయిలను క్రమం తప్పకుండా కొలిచే జాతీయ వ్యవస్థ ఇంకా బలోపేతం కాలేదు. ఇది అత్యవసరంగా పరిష్కరించాల్సిన విధానపరమైన లోటు.

ప్రభుత్వాలు చట్టాలు చేయడం ఒక్కటే సరిపోదు. పరిశ్రమలు పర్యావరణానికి అనుకూలమైన ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేయాలి. పరిశోధనా సంస్థలు దేశవ్యాప్తంగా అధ్యయనాలు చేపట్టాలి. ప్రజలు కూడా పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఎంచుకోవడం, అనవసర రసాయన వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యల ద్వారా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి.

మైక్రోప్లాస్టిక్స్ మాదిరిగానే పీఎఫ్ఏఎస్ కూడా మొదట్లో చిన్న సమస్యగానే కనిపించవచ్చు. కానీ రేపటి తరాలకు ఇది మహా ప్రజారోగ్య సంక్షోభంగా మారే అవకాశం ఉంది. ఒకప్పుడు పొగాకు, సీసం కలిగిన పెట్రోల్, ఆస్బెస్టాస్ ప్రమాదాలను గుర్తించడంలో ప్రపంచం ఆలస్యం చేసింది. ఆ పొరపాట్ల ఫలితాలను మానవజాతి ఇప్పటికీ అనుభవిస్తోంది. పీఎఫ్ఏఎస్ విషయంలో అలాంటి నిర్లక్ష్యానికి తావులేదు. ప్రకృతి మనకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు ఇస్తోంది. ఆ హెచ్చరికలను వినడమా, విస్మరించడమా అనేది మన చేతుల్లోనే ఉంది. కనిపించని ఈ శత్రువు ఇప్పటికే మన నీటిలో, మన ఆహారంలో, మన నేలలో, చివరికి మన రక్తంలో కూడా స్థానం సంపాదించుకున్నాడు. నేడు చర్యలు తీసుకుంటేనే రేపటి తరాలను రక్షించగలం. లేకపోతే భవిష్యత్తులో మానవజాతి ఎదుర్కొనే ఆరోగ్య విపత్తుల్లో పీఎఫ్ఏఎస్ ఒక ప్రధాన కారణంగా నిలిచే ప్రమాదం ఉందని ప్రపంచ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం పర్యావరణ సమస్య కాదు; మన ఉనికిని సవాలు చేస్తున్న మౌన సంక్షోభం.

**- సి.హెచ్.ప్రతాప్**

# క్షిపణి తయారీలో కొత్త దిశ

- ప్రైవేట్ రంగానికి విస్తృత అవకాశాలు
- పోటీతో ఉత్పత్తి సామర్థ్యానికి ఊతం
- యుద్ధ అవసరాలకు ద్వంద్వ ఉత్పత్తి భాగస్వాములు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** యుద్ధ పరిస్థితుల్లో ఆయుధాల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యల దిశగా భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. అధునాతన క్షిపణి వ్యవస్థలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటి నిరంతర ఉత్పత్తి, సరఫరా సామర్థ్యం మరింత ముఖ్యమనే భావనతో కేంద్ర రక్షణ శాఖ కొత్త విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు ప్రధానంగా ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో కొనసాగిన క్షిపణుల తయారీ రంగంలో ప్రైవేట్ సంస్థలకు కూడా విస్తృత అవకాశాలు కల్పించనుంది. ఇటీవల తీసుకున్న నిర్ణయాల ప్రకారం రక్షణ పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్హత కలిగిన భారతీయ రక్షణ సంస్థలకు బదిలీ చేయడానికి అనుమతి ఇచ్చింది. దీంతో ప్రైవేట్ సంస్థలు కూడా క్షిపణుల తయారీలో భాగస్వాములు కావడానికి మార్గం సుగమమైంది. అవసరమైన అర్హతలు సాధించిన సంస్థలు అభివృద్ధి, తయారీ భాగస్వాములుగా గుర్తింపు పొంది కీలక బాధ్యతలు నిర్వహించే అవకాశం పొందనున్నాయి. ఇప్పటివరకు క్షిపణుల ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలకు తోడుగా ప్రైవేట్ సంస్థలు కూడా రంగంలోకి రావడంతో పోటీ పెరిగే అవకాశముంది. దీనివల్ల ఉత్పత్తి వ్యయం, సరఫరా వేగం, తయారీ సామర్థ్యం వంటి అంశాల్లో మెరుగుదల కనిపించవచ్చని రక్షణ రంగ వర్గాలు భావిస్తున్నాయి. ఒకే సంస్థపై ఆధారపడే పరిస్థితి తగ్గడం ద్వారా ఉత్పత్తి వ్యవస్థ మరింత బలపడనుంది. దీర్ఘకాలిక యుద్ధ పరిస్థితుల్లో క్షిపణులను వేగంగా తయారు చేసి సైన్యానికి అందించడం అత్యంత కీలకమని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి క్షిపణి వ్యవస్థకు కనీసం ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములను ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఒక సంస్థలో ఏవైనా అంతరాయాలు ఏర్పడినా మరో సంస్థ ద్వారా ఉత్పత్తి కొనసాగించే అవకాశం ఉండటం ఈ విధానంలోని ప్రధాన లక్ష్యంగా పేర్కొంటున్నారు. అయితే ప్రైవేట్ రంగానికి అవకాశాలు కల్పించడం వల్ల ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యం తగ్గదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. క్షిపణుల తయారీలో విశాల అనుభవం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన ప్రభుత్వ రంగ సంస్థలు భవిష్యత్తులో కూడా కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటున్నారు. కొత్త విధానం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల సమన్వయంతో దేశ రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కానుందని భావిస్తున్నారు. భవిష్యత్తులో క్షిపణుల తయారీ హక్కులు కేవలం కేటాయింపు పద్ధతిలో కాకుండా పోటీ ఆధారంగా నిర్ణయించే అవకాశం ఉండనుంది. దీనివల్ల కొత్త భాగస్వామ్యాలు ఏర్పడి సంక్లిష్ట ఆయుధ వ్యవస్థల తయారీలో వేర్వేరు సంస్థలు ప్రత్యేక నైపుణ్యాలను వినియోగించే పరిస్థితులు ఏర్పడతాయని రక్షణ రంగ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# సర్కారు బడులకు తగ్గుతున్న ఆదరణ

- గ్రామీణ విద్యా వ్యవస్థకు ఎదురవుతున్న సవాళ్లు
- ప్రైవేటు విద్య వైపు మొగ్గు చూపుతున్న తల్లిదండ్రులు
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యపై ఆందోళన
- బలోపేత చర్యలు చేపట్టాల్సిన అవసరం

**డెస్క్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఒకప్పుడు గ్రామీణ సమాజానికి జ్ఞాన దీపాలుగా వెలిగిన సర్కారు పాఠశాలలు నేడు అనేక ప్రాంతాల్లో విద్యార్థుల కోసం ఎదురుచూసే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. వందలాది మంది విద్యార్థులతో కళకళలాడిన పాఠశాలలు ప్రస్తుతం కొద్దిమంది పిల్లలతోనే నడుస్తుండగా, కొన్ని చోట్ల పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గ్రామీణ విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న ఈ మార్పు కేవలం విద్యారంగానికే కాకుండా గ్రామీణ సమాజ భవిష్యత్తుకు కూడా ఒక హెచ్చరికగా భావించాల్సిన అవసరం ఉంది. సర్కారు పాఠశాలల్లో విద్య ఉచితంగా అందుబాటులో ఉన్నప్పటికీ తల్లిదండ్రులు అధిక సంఖ్యలో ప్రైవేటు విద్యాసంస్థల వైపు మొగ్గు చూపుతున్నారు. మంచి భవిష్యత్తు, నాణ్యమైన బోధన, ఆంగ్ల మాధ్యమంపై ఆకర్షణ వంటి కారణాలతో చాలా కుటుంబాలు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇందుకోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా విద్య విషయంలో రాజీ పడకూడదనే భావనతో ముందుకు సాగుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో జనాభా తగ్గడం కూడా మరో ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఉపాధి, జీవనోపాధి అవకాశాల కోసం అనేక కుటుంబాలు పట్టణాలకు వలస వెళ్తున్నాయి. దీంతో గ్రామాల్లో చిన్నారుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాఠశాలల్లో తరగతులు ఖాళీగా మారుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఒకటి లేదా రెండు తరగతుల్లో మాత్రమే కొద్దిమంది విద్యార్థులు మిగిలి ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. విద్యా ప్రమాణాలపై నెలకొన్న అభిప్రాయాలు కూడా ప్రభావం చూపుతున్నాయి. సర్కారు పాఠశాలల్లో అనేక మంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, సమాజంలో ప్రైవేటు విద్యాసంస్థలే మెరుగైన ఫలితాలు ఇస్తాయనే భావన బలపడింది. ఈ అభిప్రాయం వల్ల కూడా తల్లిదండ్రులు సర్కారు పాఠశాలలను దూరం పెడుతున్నారు. వాస్తవ పరిస్థితులు మారుతున్నప్పటికీ ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను మార్చడం సవాలుగా మారింది.

మౌలిక సదుపాయాల సమస్య కూడా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది. పాఠశాల భవనాల నిర్వహణ, మరుగుదొడ్లు, తాగునీరు, ఆట స్థలాలు, ఆధునిక బోధనా పరికరాల లభ్యత వంటి అంశాలు తల్లిదండ్రుల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో సదుపాయాలు అందుబాటులోకి రాలేదనే అభిప్రాయాలు ఉన్నాయి. సర్కారు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, విద్యా సామగ్రి వంటి అనేక సౌకర్యాలు అందుతున్నాయి. అయినప్పటికీ విద్యార్థుల చేరికలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. దీనికి కారణం కేవలం సౌకర్యాల లభ్యత కాకుండా విద్యా నాణ్యతపై ప్రజల్లో నమ్మకం పెరగాల్సిన అవసరం ఉండటమే. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటున్నారు.

గ్రామాల్లో పాఠశాలలు ఖాళీ కావడం వల్ల సామాజిక ప్రభావం కూడా కనిపిస్తోంది. ఒక గ్రామంలో పాఠశాల సజావుగా నడిస్తే అక్కడ పిల్లల సందడి, విద్యా వాతావరణం, సామాజిక చైతన్యం కనిపిస్తాయి. పాఠశాలలు బలహీనపడితే గ్రామీణ సమాజంలో విద్యాపై ఆసక్తి కూడా తగ్గే ప్రమాదం ఉంటుంది. దీర్ఘకాలంలో ఇది గ్రామాల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల పాత్ర ఈ సందర్భంలో అత్యంత కీలకం. విద్యార్థుల్లో ఆసక్తి పెంచే బోధన, తల్లిదండ్రులతో నిరంతర సంబంధాలు, పాఠశాల కార్యకలాపాల్లో సమాజ భాగస్వామ్యం వంటి అంశాలు సర్కారు పాఠశాలలపై నమ్మకాన్ని పెంచగలవు. అనేక ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కృషితో సర్కారు పాఠశాలలు మళ్లీ పూర్వ వైభవాన్ని సాధించిన ఉదాహరణలు కూడా ఉన్నాయి.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నైపుణ్య ఆధారిత విద్య, క్రీడలు, కళలు, సృజనాత్మక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సర్కారు పాఠశాలలను మరింత ఆకర్షణీయంగా మార్చవచ్చు. కేవలం పరీక్షల ఫలితాలకే పరిమితం కాకుండా సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విద్యను అందించడం కాలానుగుణ అవసరంగా మారింది. ఈ దిశగా నిరంతర సంస్కరణలు అవసరం. గ్రామాల్లో ఖాళీ అవుతున్న సర్కారు పాఠశాలల సమస్యను కేవలం విద్యార్థుల సంఖ్య తగ్గుదలగా చూడలేం. ఇది గ్రామీణ విద్య, సామాజిక అభివృద్ధి, భవిష్యత్ తరాల అవకాశాలకు సంబంధించిన అంశం. ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామీణ సమాజం కలిసి పనిచేసి సర్కారు పాఠశాలలపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. సర్కారు పాఠశాలలు బలపడితేనే గ్రామీణ భారత భవిష్యత్తు మరింత బలంగా నిలుస్తుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారం

- **రాజ్యాంగబద్ధ సంస్థలపై దాడులు చేయడం సరికాదని వ్యాఖ్య**
- **వాస్తవాలను ప్రజల ముందుంచామని వెల్లడి**
- **విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి వ్యాఖ్యలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. ప్రజల మద్దతు పొందడంలో విఫలమవుతున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, భారత ఎన్నికల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో భారతదేశం అనుసరిస్తున్న విధానాలను అనేక దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. ఇలాంటి సమయంలో ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అపోహలు వ్యాప్తి చేస్తున్నారని రామచందర్ రావు ఆరోపించారు. దీనికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచామని, తప్పుడు ప్రచారాలను ఖండించామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిబంధనల అమలుకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా రాజకీయ ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడం అన్ని రాజకీయ పార్టీల బాధ్యత అని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లో ప్రస్తావించాలని సూచించారు.

ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాల కంటే వాస్తవాల ఆధారంగా రాజకీయ చర్చలు జరగాలని రామచందర్ రావు అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజలకు సరైన సమాచారం అందించేందుకు బీజేపీ కృషి చేస్తుందని రామచందర్ రావు తెలిపారు.

# ఘనంగా ముగిసిన 70వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడలు




**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు రోజులుగా ఉత్సాహభరితంగా కొనసాగిన 70వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని 12 మండలాల నుంచి సుమారు 1,600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పోటీపడి తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ముగింపు కార్యక్రమంలో నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎల్.జే. పాల్ మాట్లాడుతూ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి త్వరలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి సీహెచ్. రఘు, పేట సంఘం అధ్యక్షుడు ఎస్. రమేష్, ప్రధాన కార్యదర్శి సురేష్, సీనియర్ వ్యాయామ విద్యా అధికారి టి. రాజయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు విజిత, జి. రాజయ్య, అన్వర్, రమేష్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

# వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన ఉప సంచాలక జనరల్





**వరంగల్, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ సంచాలకత్వం ఉప సంచాలక జనరల్ ఎయిర్ కమాండర్ నరసింగ్ సైలానీ సోమవారం వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయం, వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 13 వరకు తాంబరంలో నిర్వహించనున్న అఖిల భారత వాయుసైనిక శిబిరంలో ఎన్‌సీసీ విద్యార్థుల పాల్గొనడానికి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆయన మామునూరు విమానాశ్రయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడి వారికి మార్గనిర్దేశం చేశారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. అఖిల భారత వాయుసైనిక శిబిరం పోటీల్లో పాల్గొననున్న బృందంతో ప్రత్యేకంగా మాట్లాడి వారిని ప్రోత్సహించారు.

అనంతరం వరంగల్ ఎన్‌సీసీ గ్రూప్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న ఉప సంచాలక జనరల్‌కు గ్రూప్ కమాండర్ కల్నల్ రాజేష్ ఆర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వరంగల్ గ్రూప్ పరిధిలోని అన్ని ఎన్‌సీసీ బెటాలియన్ల కమాండింగ్ అధికారులు, సిబ్బందితో సమావేశమై శిక్షణ, పరిపాలనకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. బెటాలియన్లలో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాలు, ఇతర ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. ఎన్‌సీసీ విద్యార్థులకు ఆసక్తి, అంకితభావంతో శిక్షణ అందిస్తున్న శిక్షకులను అభినందిస్తూ వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం హనుమకొండలోని గ్రూప్ ప్రధాన కార్యాలయం, మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను సందర్శించారు. అక్కడ ఎన్‌సీసీ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి శిక్షణ తీరును పరిశీలించి అభినందించారు.

# భారత్–కెన్యా సముద్ర సహకారానికి మరో అడుగు





- **మొంబాసా నౌకాశ్రయానికి చేరుకున్న ఐఎన్ఎస్ తార్కాష్**
- **సముద్ర భద్రతలో పరస్పర సహకారానికి ప్రాధాన్యం**

**మొంబాసా, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక మార్గనిర్దేశిత క్షిపణి యుద్ధ నౌక ఐఎన్ఎస్ తార్కాష్ కెన్యాలోని మొంబాసా నౌకాశ్రయానికి చేరుకుంది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న కార్యాచరణ విరామ కార్యక్రమంలో భాగంగా ఈ యుద్ధ నౌక అక్కడ నిలవనుంది. ఈ పర్యటన భారత్, కెన్యా దేశాల మధ్య సముద్ర భద్రతా సహకారాన్ని మరింత బలోపేతం చేయనుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల నౌకాదళాల మధ్య వృత్తిపరమైన చర్చలు, అనుభవాల మార్పిడి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే నౌక సిబ్బంది, స్థానిక ప్రజల మధ్య పరస్పర సమావేశాలు, సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా రెండు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత బలపడనున్నాయి.

అక్టోబర్ 1న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐఎన్ఎస్ తార్కాష్‌ను సందర్శకుల కోసం తెరవనున్నారు. ఈ సందర్భంగా నౌక సామర్థ్యాలు, నౌకాదళ కార్యకలాపాల గురించి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. సముద్ర భద్రతలో భారత నౌకాదళం నిర్వహిస్తున్న కీలక పాత్రను ప్రత్యక్షంగా చూసే అవకాశం సందర్శకులకు లభించనుంది. మొంబాసా పర్యటన ముగిసిన అనంతరం ఐఎన్ఎస్ తార్కాష్ కెన్యా నౌకాదళంతో కలిసి సముద్ర విన్యాసాలు నిర్వహించనుంది. ఈ విన్యాసాల ద్వారా పరస్పర సమన్వయం, సమాచార మార్పిడి, సముద్ర భద్రతా సన్నద్ధత అంశాలను మరింత మెరుగుపరచడంపై దృష్టి సారించనున్నారు. పశ్చిమ హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, భద్రత, సహకారాన్ని పెంపొందించేందుకు భారత్ చేపడుతున్న సముద్ర దౌత్య కార్యక్రమాల్లో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. సముద్ర మార్గాల భద్రత, అంతర్జాతీయ వాణిజ్య రక్షణ, సముద్ర నేరాల నిరోధం వంటి అంశాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేయడానికి ఇది వేదికగా నిలవనుంది. భారత్ ప్రతిపాదించిన మహాసాగర్ దృష్టికోణానికి అనుగుణంగా ఈ పర్యటన కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంత దేశాలతో స్నేహపూర్వక సంబంధాలు, పరస్పర అభివృద్ధి, భద్రతా సహకారాన్ని మరింత విస్తరించడంలో ఐఎన్ఎస్ తార్కాష్ మొంబాసా పర్యటన కీలక మైలురాయిగా నిలుస్తుందని వెల్లడించారు.

# ఈవీఎంలు, ఓటర్ల జాబితాలపై రాహుల్ ఆరోపణలు




- **ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగించాలని పిలుపు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఈవీఎంలు, ఓటర్ల జాబితాల విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగించాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో మంగళవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో రెండు రకాల 'మ్యాచ్‌ఫిక్సింగ్' జరుగుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒకటి ఈవీఎంలకు సంబంధించినదైతే, మరొకటి ఓటర్ల జాబితాల్లో ఉద్దేశపూర్వక మార్పుల రూపంలో జరుగుతోందని పేర్కొన్నారు. గత ఎన్నికల ప్రక్రియపై తమ పార్టీ పలుమార్లు సందేహాలు వ్యక్తం చేసిందని, ఎన్నికల పారదర్శకతపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని అన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల స్వరానికి తగిన ప్రాధాన్యం లభించడం లేదని కాంగ్రెస్ భావిస్తోందని రాహుల్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడం, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని కాపాడడం అత్యంత అవసరమని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో కాంగ్రెస్ పోషించిన పాత్రను గుర్తు చేస్తూ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం మరోసారి సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కూడా కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ముసాయిదా జాబితాల నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించబడ్డాయని పార్టీ ఆరోపిస్తోంది. ఓటర్ల చేర్పులు, తొలగింపులు, దరఖాస్తుల పరిశీలన వంటి అంశాల్లో పారదర్శకత ఉండాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ఇదే సమయంలో ఎన్నికల సంఘం మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తూ స్పష్టీకరణ ఇచ్చింది. ఓటర్ల జాబితాలకు సంబంధించిన నిర్ణయాలు, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలు ఎన్నికల కమిషన్‌లోని ముగ్గురు కమిషనర్ల ఆమోదంతోనే అమలవుతున్నాయని పేర్కొంది. కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు, ప్రశ్నలు రావడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమని ఎన్నికల సంఘం వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు పారదర్శకత, స్పష్టత అవసరమని వివిధ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఢిల్లీ రవాణా సౌకర్యాల విస్తరణకు రూ.1,941 కోట్ల ప్రాజెక్టులు



- **బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశ ప్రారంభం**
- **ప్రయాణ సమయం తగ్గి ట్రాఫిక్ సమస్యలకు ఉపశమనం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ రాజధాని ఢిల్లీలో రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి ప్రజలకు సులభమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు రూ.1,941 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించారు. అలాగే మరికొన్ని కీలక రవాణా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు ఢిల్లీ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజల ప్రయాణాన్ని మరింత వేగవంతం చేయనున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రూ.1,635 కోట్ల వ్యయంతో నిర్మించిన బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశను ప్రజలకు అంకితం చేశారు. ఈ రహదారి అందుబాటులోకి రావడంతో తూర్పు ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ ప్రాంతాల మధ్య సిగ్నల్ రహిత రాకపోకలు సాధ్యమవుతాయని అధికారులు తెలిపారు. నగరంలోని ప్రధాన మార్గాలపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు వేలాది మంది ప్రయాణికులకు సమయం ఆదా కానుంది.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన అమిత్ షా, దేశవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారులు, వంతెనలు, రైల్వేలు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఢిల్లీ వంటి మహానగరాల్లో పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఆధునిక రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశ పూర్తికావడంతో నగరంలోని పలు ప్రాంతాల మధ్య ప్రయాణ దూరం, సమయం గణనీయంగా తగ్గనుందని అధికారులు వివరించారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు ప్రతిరోజూ ఎదుర్కొనే ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందన్నారు. ఇంధన వినియోగం తగ్గడంతో పాటు వాయు కాలుష్యాన్ని కూడా నియంత్రించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు.

అదనంగా మోదీ మిల్-సావిత్రి సినిమా ఫ్లైఓవర్, లోనీ అండర్‌పాస్ నిర్మాణ పనులకు అమిత్ షా శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత నగరంలోని రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తగ్గి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక రవాణా సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశ అభివృద్ధికి మౌలిక వసతుల నిర్మాణమే పునాదిగా నిలుస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో రహదారులు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, పట్టణ అభివృద్ధి ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టులు ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడతాయని ఆయన అన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in